www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 జూన్ 2023

5

అన్నమయ్య



అంతర్జాతీయ విమాన సర్వీసులు పునరుద్ధరించాలి

రాజంపేట అర్బన్ : తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ విమాన సర్వీసులను పునరుద్ధరించాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల రాయుడు పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య రాష్ట్ర పౌర విమానయాన శాఖ మంత్రి వి.కె సింగ్ లకు లేఖ రాశారు. ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుపతి పట్టణానికి ప్రపంచ నలుమూలల నుంచి స్వామి దర్శనానికి విచ్చేస్తుంటారని, పర్యాటకులు ప్రస్తుతం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబై వంటి నగరాల విమానాశ్రయాలను ఆశ్రయించి అక్కడి నుంచి తిరుపతికి కష్ట సాధ్యమైన ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. చిత్తూరు, పొరుగు జిల్లాలలో అత్యధిక మంది జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుంటారని, వీరు కూడా సుదూర నగరాలైన చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాదు వంటి విమానాశ్రయాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. 2017లో తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయం హోదా ఒదించినప్పటికీ అంతర్జాతీయంగా విమాన సర్వీసులు లేకపోవడం వల్ల విదేశీ పర్యాటకులతో పాటు స్వదేశీయులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ మురళీ కృష్ణ

విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు ఈ దశలో తమ జీవితంలోఎలాంటి దురలవాట్లకు అవకాశం ఇవ్వకుండా క్రమశిక్షణతో సత్ప్రవర్తనతో మెలిగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని టూ టౌన్ సిఐ ఎస్. మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాలలో అవేర్నెస్ ఆన్ యాంటీ డ్రగ్ అండ్ సైబర్ అవేర్నెస్ అనే సెమినార్ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశానికి నిజమైన సంపద యువతేనని, మన శత్రు దేశాలు యువతని నిర్వీర్యం చేయాలని దురుద్దేశంతో మాదకద్రవ్యాలను మన దేశంలోనికి ప్రవేశపెడుతున్నాయని తెలిపారు. శత్రు దేశాల దుష్టపన్నాగాలను తిప్పికొట్టేందుకు యువత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కఠిన వైఖరి అవలంభిస్తున్నాయని ఎవరైనా మాదకద్రవ్యాలు (డ్రగ్స్) కొనినా, అమ్మినా వారి పైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జీవితం చాలా విలువైందని మాదకద్రవ్యాల వినియోగం వల్ల మనిషి విచక్షణారహితంగా ప్రవర్తించటం వల్ల చాలా కుటుంబాలు చాలా వరకు నాశనమవుతున్నాయని చెప్పారు. మారుతున్న కాలాన్ని బట్టి కూడా సైబర్ నేరస్తులు ఇప్పటికే పలు రకాల లింకులతో మోసం చేస్తున్నారని వచ్చిన మెసేజ్ లకు నకిలీ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా ఫోన్ చేసిన ఒటిపి కాని, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్ప రాదని సూచించారు. ఎవరైనా సైబర్ క్రైమ్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలని ఆయన తెలియజేశారు. "ఆర్యకులంలో టూటౌన్ ఎస్ఐ శ్రీ సుబ్బా రెడ్డి కళాశాల కరస్పాండెంట్ శ్రీ కృష్ణారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యాకానుక అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక అవెన్యూ రోడ్డులోని హోప్ హై స్కూల్(బడెడ్)లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నవాజ్ పాల్గొని విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక పథకం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డేవిడ్ సంజయ్ హెడ్ మాస్టర్ గ్రేస్ నందిని, టీచర్లు సుగుణమ్మ భారతి రాజ్ కుమార్, సెక్రెటరీ భక్తవత్సలం పాల్గొన్నారు.

సమన్వయంతోనే ప్రగతి సాధ్యం : విసి

కడప అర్బన్ : సమిష్టి కృషి, సమన్వయంతో శాఖల అభివృద్ధి జరగాలని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయ ఐటీ సెల్ సంచా లకులు ఆచార్య ఎం.వి.శంకర్ ఆధ్వర్యంలో గురుకులానికి సంబంధించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ సమగ్ర సమాచారంతో ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారం భించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ శాఖల సమగ్ర ప్రగతి వెబ్ సైట్ లింకులో ప్రతిబింబిస్తోందని తెలిపారు. మరింత సమగ్రవంతంగా ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బోధన, పరిశోధన, అభివృద్ధితో శాఖలు ముందు పోటీ ఉండా లన్నారు. చక్కటి సమన్వయంతో ఉత్తమ ఫలితాలను సాధిం చవచ్చు అన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా సెక్రెటరీ జనరల్ షేక్. మొహమ్మద్ ఇర్షాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించే రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధను కడపలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో 117ను అమలు చేసిందని తెలిపారు. జీవో ద్వారా పాఠశాల విద్య చిన్నాభిన్నమైందని విమర్శించారు. జీవోను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందకుండా చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయులను సందర్భంగా పేరుతో పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ వేధింపులను నియంత్రించాలన్నారు. ఉపాధ్యాయులు చేపట్టే అన్ని రకాల ఉద్యోగులను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. గ్యారెంటీ పెన్షన్ స్కీమును అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సితో పాటు అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని కోరారు. లేనిపక్షంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, బిటిఏ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్రబాబు, డాక్టర్.హరి కొండయ్య పాల్గొన్నారు.



బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

'ముదివేడు' పునరావాస చర్యలు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ముదివేడు బాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు బాధితులకు సహాయ పునరావాస చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష పి.ఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మంగంపేట నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ అంశంపై జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి డిఆర్ఒ, ఆర్‌డిఒ, ఎన్‌డిసి, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్, విద్యుత్, హౌసింగ్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిమిత్తం కురబలకోట మండలంలో శెట్టివారిపల్లి, నేతాజీ నగర్, కొత్తపల్లి అలాగే బి.కొత్తకోట మండలంలో దిన్నమీదిపల్లి, చవటకుంటపల్లి తదితర ఐదు గ్రామాలు ముంపునకు గురికానున్నాయని తెలిపారు. కురబలకోటకు సంబంధించి ముదివేడు క్రాస్‌లో, బి కొత్తకోటకు సంబంధించి కాండ్లమడుగు క్రాస్‌లో పునరావాస కాలనీలు ఏర్పాటు చేస్తామని సదరు గ్రామాల ముంపు బాధితులకు గుర్తించిన పునరావాస లే అవుట్‌లలో వేగవంతంగా పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. పునరావాస నిమిత్తం త్వరితగతిన అంచనా వివరాలు రూపొందించాలన్నారు. ఇందుకు సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి వెంటనే సమర్పించాలన్నారు. ఆయా మండలాలలో గ్రామ సభను నిర్వహించి ముంపు వాసుల జాబితాను రూపొందించాలని పేర్కొన్నారు. కొత్తగా ప్రతిపాదిస్తున్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణం, రహదారులు, కాలువలు, నీరు, విద్యుత్ సౌకర్యాలు తదితర మౌలిక వసతులు కల్పించుటకు సంబంధిత శాఖల అధికారులు అంచనా ప్రతిపాదనలను సమర్పించాలని ఆర్అండ్‌బి, ఆర్డబ్ల్యుఎస్, పిఆర్, విద్యుత్, హౌసింగ్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులను ఆదేశించారు. మంగంపేట ఆర్ అండ్ ఆర్ అంశానికి సంబంధించి సమీక్షిస్తూ కాపుపల్లి, దళితవాడ గ్రామాల వారికి మంగంపేట వద్ద పునరావాసం కోసం లేఅవుట్‌ను త్వరగా నిర్మించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్ పూర్తయిన వెంటనే అక్కడ మౌలిక వసతులు కల్పనకు ఆయా శాఖలు త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేసి సదరు నిర్వాసితులను త్వరగా తరలించాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, మదనపల్లి ఆర్‌డిఒ మురళి, ఎస్‌డిసి, ఆయా మండలాల తహశీల్దార్లు, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్, విద్యుత్, హౌసింగ్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష పి.ఎస్.

జన సంక్షేమమే జగనన్న సంకల్పం : ఎమ్మెల్యే



గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జన సంక్షేమమే జగనన్న సంకల్పమని వైసిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 21 సచివాలయ పరిధి 28 29 వార్డులలో గడప గడప కు మన ప్రభుత్వంను నిర్వహించారు. భట్టువీధి,శుక్రుమియా వీధి, రంగీన్ షా వలీ చౌషన్ దర్గా వీధులు, నాదాన వీధి, న్యూ సీమ హోటల్ వీధి, ట్రంక్ రోడ్డు, మేదర వీధి లలో ఆయన తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరించారు. తొలుత బస్ స్టాండ్ సర్కిల్ లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టువీధి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గతంలో సరైన ప్రణాళికలు లేక ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో వీధులలో ఆటోలు సైతం వెళ్లలేని పరిస్థితులకు పరిష్కార మార్గాలకు కృషి చేస్తున్నామన్నారు. ఇళ్లపైన విద్యుత్ లైన్లను తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రెయినేజీ, పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులందరికీ నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో పక్కా గృహాలను మంజూరు చేయిస్తామన్నారు. దర్బార్ వలీ కుమార్తె షిఫా ఫర్వీన్ తాను ఇంటర్ రెండవ సంవత్సరం హెచ్ఇసి గ్రూపు చదువుచున్నానని, బుక్స్ కావాలని ఎమ్మెల్యేను వెంటనే పంపుతామనిచెప్పారు. భట్టువీధి, ట్రంక్ రోడ్ ,మేదర వీధులలోని ప్రజలు, దుకాణదారులు, చిరు వ్యాపారులతో శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. వారి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, స్థానిక కౌన్సిలర్లు మెహె జబీన్, అన్నా సలీం, సాదిక్ అలీమదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్,మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్, ఆసీఫ్ అలీ ఖాన్, కొలిమి ఛాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, గౌస్ ఖాన్, అల్తాఫ్, రియాజ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, జానం రవీంద్ర యాదవ్, కో ఆప్షన్ అయ్యవారు రెడ్డి,హజరత్ ఖాదర్ వలీ, పార్టీ అధికార ప్రతినిధి విజయ భాస్కర్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, రియాజుర్ రెహమాన్,మాజీ కో ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, సున్నా ఇర్షాద్, మూసా,సుప్రీం పైప్ ఫజులుల్ రెహమాన్,షిరిడీ సాయి మనోజ్ రెడ్డి, కొత్తపల్లె ఇంతియాజ్, నాదర్ బేగ్, జావీద్,అమీర్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు ఆపడం కంటి తుడుపు చర్యే

టిడిపి జాతీయ నేత నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణ శివారులోని శ్రీకృష్ణదేవరాయ నూనె విత్తుల కర్మాగారం భూమి ఆక్రమణలపై అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పందించి అక్రమ నిర్మాణాలు ఆపమని పీలేరు తహశీల్దార్ ధనుంజయలును ఆదేశించడం కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పీలేరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనూ ఇలాగే పీలేరు పట్టణం, పట్టణ శివారుల్లోని గూడరేవుపల్లి, దొడ్డిపల్లి, ఎర్రగుంట్లపల్లి, బోడుమల్లువారిపల్లి తదితర గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కోట్ల రూపాయల విలువైన భూములు కబ్జాలకు పాల్పడుతుంటే, ఉమ్మడి చిత్తూరుజిల్లా కలెక్టర్, లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అప్పటి కలెక్టర్ రెవెన్యూశాఖ అధికారుల కమిటీలు వేసి, భూ సర్వేచేసి భూ ఆక్రమణ జరిగింది నిజమేనని వాస్తవాల్ని వెలికితీశారు. దీంతో అప్పటి మదనపల్లి సబ్ కలెక్టర్ జహ్నవి నివేదిక తయారుచేసి కింది స్థాయి అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణలకు గురైన భూముల్లో సర్వే నెంబర్లు కనబరిచి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని రక్షదారులు దౌర్జన్యంగా రాత్రికి రాత్రే పీకి పడేశారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పీలేరులో జరిగిన భూ ఆక్రమణలపై విచారించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఉత్తరం రాసి, స్వయంగా అసెంబ్లీలోనూ ఈ విషయం లేవనెత్తారని, అవన్నీ ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ కబ్జాల విషయంపై లోకాయుక్త కూడా పీలేరు పరిసరాల్లో పర్యటించి భూ ఆక్రమణలు జరిగింది నిజమేనని నిగ్గుతేల్చిందని తెలిపారు. వారిచ్చిన నివేదిక ప్రకారం పీలేరు పట్టణ శివారుల్లో భారీగా పోలీస్ బందోబస్తుతో రంగంలోకి దిగిన రెవెన్యూశాఖ సిబ్బంది జెసిబిలతో రెండు మూడుచోట్ల అక్రమాలు తొలగించే క్రమంలో వైసిపి నాయకులు అడ్డు తగలడంతో నామ మాత్రంగా నిలిపివేశారని చెప్పారు. కొద్ది రోజుల తర్వాత యధారాజా, తధా ప్రజా అన్నట్లు మళ్ళీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు మొదలు పెట్టారని వాపోయారు. రెవెన్యూశాఖ అధికారులు చేపట్టిన అక్రమ తొలగింపులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తుందని అన్నారు. ఆయిల్ సీడ్స్ కు సంబంధించిన 65ఎకరాల భూమిని రెవెన్యూశాఖ అధికారులు వెలికితీయాలని డిమాండ్ చేశారు. పీలేరు పరిసరాల్లో జరుగుతున్న భూ అక్రమాలపై తెలుగు దేశంపార్టీ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని చెప్పారు. సమావేశంలో తెలుగుదేశంపార్టీ పుంగనూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రా రెడ్డితోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

వడ్డెర విద్యార్థిపై హత్యాయత్నం దారుణం

ప్రజాశక్తి - రాయచోటి



మట్లాడుతున్న జిల్లా బిసి కులాల ఐక్యవేదిక కన్వీనర్

మదనపల్లెకు చెందిన వడ్డెర విద్యార్థి ఆది మూర్తి పై జరిగిన హత్యాయత్నం దారుణమని జిల్లా బిసి కులాల ఐక్యవేదిక కన్వీనర్ కె.జీవా నందం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పి.బాలక్రిష్ణ, పి.రవీంద్ర, మున్నా పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాధితుడి స్నేహితుని బర్త్‌డే పార్టీ పేరుతో నమ్మించి సిటిఎంలో నిర్మానుష ప్రాంతానికి పిలిపించిన ఐదుగురు రౌడీమూక పథకం ప్రకారం హత్య చేయడానికి, కర్రలతోనూ, రాడ్లతోనూ ముకుమ్మడిగా దాడిచేశారన్నారు. అందులో ఒకరు దాడి చేస్తున్న సంఘ టనను సెల్ ఫోన్లో చిత్రీకరించారన్నారు. చావుభయంతో బాధితుడు కాపాడండని అరుస్తూ ఎలాగోలా వారినుండి తప్పించుకొని తనతల్లితో కలిసి పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. బరితెగించిన రౌడీ మూకలను కఠినంగా శిక్షించకుండా వదిలేస్తే ఎంతటి ఘాతుకానికైనా వెనుకాడరని అన్నారు. ఈ సంఘటనపై జిల్లాస్థాయి పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి నిందితులకు కఠినమైన శిక్షపడేలా చూడాలని వారన్నారు. బాధితుని పక్షాన స్పందించి దగ్గరుండి తామున్నామంటూ వెన్నుదన్నుగా నిలిచిన కుల పెద్దలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రమంతటా కులసంఘ నాయకులు బాధితునికి అండగా నిలబడి స్పందించిన తీరు అభినం దనీయమని వారన్నారు.

ఎసిబి వలలో ఎర్రగుంట్ల సిఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



సిఐ మంజునాథరెడ్డి

ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ సిఐ మంజునాథరెడ్డి ఎస్‌సిబికి పట్టుబడ్డారు. తిరుపతి ఎసిబి అడిషనల్ ఎస్‌పి దేవిప్రసాద్ ఇందుకు సంబంధించిన వివరాలు మంగళవారం వెల్లడించారు. స్టేషన్ పరిధిలోని నాపరాల్ల గనుల వద్దనున్న వేస్ట్ మెటీరియల్‌ను రవాణా చేసే టిప్పర్ యజమానుల నుంచి ఒక్కో ట్రిప్పుకు రూ. 1500 నుంచి రూ. 3 వేల వరకు సిఐ మంజునాథరెడ్డి లంచం డిమాండ్ చేశారని, అందుకు సంబంధించి ఎర్రగుంట్లకు చెందిన టిప్పర్ యజమాని గరిశా గంగాధర్ రెడ్డి అనే వ్యక్తి ఏప్రిల్ 25న 14400 నెంబర్ ద్వారా స్పందనలో ఫిర్యాదు చేశారని తెలిపారు. చివరికి ఒక ట్రిప్పు రూ. 700కు బేరం కుది రినట్లు తెలిపారు. టిప్పర్ యజమాని నెల వరకు రవాణా చేసిన ట్రిప్పులకు సంబంధించి రూ. 18 వేలను సిఐ మంజునాథరెడ్డి జిలాని అనే వ్యక్తికి ఇవ్వమని చెప్పారని తెలిపారు. ఈనేపథ్యంలో మంగళ వారం జిలాని టిప్పర్ యజమాని నుంచి రూ.8600 తీసుకుంటూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని మొత్తాన్ని స్వాధీనం చేసుకొని విచారిస్తున్నామని తెలిపారు. సిఐ మంజూనాథరెడ్డిని మరో టీమ్ కర్నూలులో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. ఎసిబి సిఐలు శ్రీనివాసులురెడ్డి, ఎలమ రాజు, కష్ణమోహన్, అలీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు అడిషనల్ ఎస్‌పి చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

'ప్రయివేట్, కార్పొరేట్'కు

అమ్ముడుపోయిన విద్యాశాఖాధికారులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు అమ్ముడుపోయారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠ్యపుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలల యాజమాన్యాలకు అమ్ముడుపోయారని ఆరోపించారు. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, మదనపల్లె, ప్రాంతాలలో పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతూ పాఠ్యపుస్తకాలు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థి సంఘాలుగా అనేక మార్లు పిర్యాదులు చేసినా ఎటువంటి విచారణ, చర్యలు చేపట్టలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో ప్రభుత్వం టెండర్ ద్వారా ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్కులు, కుట్టు కూలీతో సహా మూడు జతల యూనిఫామ్, ఒక జత బూట్లు, సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్ తో పాటు, డిక్షనరీ ఇలా అన్నిటికీ కలిపి కేవలం మొత్తం రూ.2,400 ఖర్చు చేస్తుందని., అదే కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో వారు ఇచ్చే 7, 8 పుస్తకాలకే రూ.6,000 నుండి రూ.10 వేలు వసూలు చేస్తున్నారని అన్నారు. ఫీజులు, డొనేషన్ల రూపంలో తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల విషయంలో మామూళ్లు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని, అందుకే ప్రతి ఏటా నియోజవర్గ కేంద్రాలలో అనేక కార్పొరేట్, పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు లేని పాఠశాలల దగ్గర నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేశారని, అందువల్లనే గుర్తింపు లేని పాఠశాలల వివరాలు ప్రకటించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, తనిఖీ సమయంలో విద్యార్థి సంఘాలను అనుమతించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు హరి, శశికుమార్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి కె. కేశప్ప


చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రౌడీ షీటర్లు చట్టాన్ని అతిక్రమించి సివిల్ పంచాయతీలు, దందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి కె. కేశప్ప హెచ్చరించారు. మంగళవారం స్థానిక మదనపల్లి సబ్ డివిజనల్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్‌పి ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్ పైన తాము నిఘాఉంచామని ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి సెటిల్మెంట్లు, దందాలకు పాల్పడిన వారిపై పీడి చట్టాన్ని ప్రయోగించడంతోపాటు జిల్లా బహిష్కరణ కూడా తప్పదని ఆయన హెచ్చరించారు. రౌడీ షీటర్ల ప్రవర్తనను పరిశీలించి తమ ఎస్ఐల ద్వారా నివేదిక తెప్పించుకొని సత్ప్రవర్తన కలిగినటువంటి వ్యక్తుల రౌడీ షీట్ తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నాటుసారా, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ నెల వరకు సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్ల ప్రవర్తనను గమనించి షీట్ నుంచి తొలగిస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో కూడా ఎవరైనా తాము హద్దు మీరు ప్రవర్తించిన కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ, తాలూకా సిఐ సత్యనారాయణ రూరల్ సిఐ శివాంజనేయులు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో సహాయ అధ్యాపకునిగా పనిచేస్తున్న గుత్తి సురేష్ బాబు డాక్టరేట్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అన్నమయ్య జిల్లా నందలూకు చెందిన గుత్తి వెంకట సుబ్బయ్య, గుత్తి కృష్ణ కుమారి దంపతుల కుమారుడు గుత్తి సురేష్ బాబు కు, కర్ణాటక రాష్ట్రం లోని బెల్గావిలో ఉన్న విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారన్నారు. కళాశాలలో మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నఆయన 'ప్రాసస్ ప్లానింగ్ అండ్ కాన్ఫిగరేషన్ సెలక్షన్ ఫర్ రికాంఫిగరబుల్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్, ఏ సిములేషన్ అప్రోచ్' పై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లుగా తెలిపారు. పెద్ద పరిశ్రమల్లో ప్రతి యంత్రాన్నీ బహుళ ఉత్పత్తి వ్యవస్థగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో అనుసంధానం చేసి, పరిశ్రమల మార్కెట్, డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులను తయారీ చేసి లాభాలను పొందుటకు ఈ పరిశోధన దోహద పడుతుందని ఆయనకు గైడుగా వ్యవహరించిన డా.ఎన్ చిక్కన్న పేర్కొన్నారు. గుత్తి సురేష్ బాబును కళాశాల కార్యదర్శి చొప్పా గంగిరెడ్డి , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ట్రెజరర్ చొప్పా అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.ఏం.వి నారాయణ, మెకానికల్ విభాగాధిపతి ఏ.హేమంత కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

29 నుంచి తాళ్లపాకలో వార్షిక బ్రహ్మోత్సవాలు

రాజంపేట అర్బన్ : అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి జూలై 7 వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు జూన్ 28న అంకురార్పణ నిర్వహిస్తారు. జూన్ 29న ఉదయం 9 నుండి 10 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి శేషవాహన సేవ నిర్వహిస్తారు. జూన్ 30, జులై 1, 2, 3వ తేదీల్లో ఉదయం పల్లకీ సేవ నిర్వహిస్తారు. జూన్ 30న రాత్రి హంస వాహనం, జూలై 1న రాత్రి సింహ వాహనం, జూలై 2న రాత్రి హనుమంత వాహనం, జూలై 3న రాత్రి గరుడవాహనంపై స్వామివారు భక్తులను కనువిందు చేస్తారు. జులై 4 సాయంత్రం 6 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్న ప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత రాత్రి 8.30 గంటలకు గజ వాహనంపై స్వామివారు విహరిస్తారు. జులై 5న సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, జులై 6న రాత్రి అశ్వ వాహనం, జులై 7న ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాల ఎముగియనున్నాయి. జులై 8న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యేను కలిసిన ఎంపిపి

మండల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-కలకడ

మండల అభివృద్ధికి మీ సహాయం ఎంతో అవసరమని చింతల రామచంద్రారెడ్డిని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ కోరారు. మంగళవారం గుర్రంకొండ మండలం రామాపురంలో నిర్వహి స్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేని కలిసామన్నారు. కలకడ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ మాకు ఉండాలని కోరారు. మా ఎమ్మెల్యే సహకారంతో మండలంలో వివిధ రకాల అభివృద్ధి పనులు జరుగుతూ నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడానికి ఎంతో అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్దకు సమస్యలను తీసుకెళ్లి వివరించి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో పయనింప చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా మా మండలంలో అభివృద్ధి పనులపై చొరవచూపి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి బ్రాంచ్ ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో అక్కడ పనిచేస్తున్న నాగశ్రావణ్ కుమార్ కోయంబత్తూరు దిండిగల్ బ్రాంచ్‌కి బదిలీ కాగా ఈయన స్థానంలో సదుము ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవికుమార్ బదిలీపై తంబళ్లపల్లెకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు.

వేరుశనగ విత్తనాలు మంజూరు

ప్రజాశక్తి-గాలివీడు

మండలానికి నాలుగు క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు రెండో విడత మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. కె6 రకం 30 కేజీల వేరుశనగ కాయల బస్తా రూ.1670లకు రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి డబ్బు చెల్లించి కాయలను తీసుక వెళ్ళవచ్చని పేర్కొన్నారు. మొదటి విడత కె6 రకం తక్కువ కావడంతో రెండో విడత పంపిణీ చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి పైపు లీకేజీ : వృథాగాపోతున్న నీరు

ప్రజాశక్తి-గాలివీడు



పైప్‌లైన్ లీకేజీతో బురదమయమైన రోడ్డు

స్థానిక బస్టాండ్ ఆవరణంలో పెద్దూర్ రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ లీక్ కావడం తాగునీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తోంది. రోడ్డంతా బురదమయమై చిత్తడిగా మారిపోయింది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీరు వృథా కాకు ండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎంఇఒగా నిర్మలకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఒ.నిర్మల ఉద్యోగోన్నతి పొంది వైఎస్ఆర్ జిల్లా, కలసపాడు ఎంఇఒగా బదిలీ అయ్యారు. గత మూడున్నర సంవత్సరంలో నుంచి ఇక్కడ ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఎంఇఒగా పదోన్నతిపై పొందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నందలూరు : నందలూరు మండలానికి రెండవ ఎంఇఒగా అనంతకృష్ణ నూతనంగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. చిట్వేలి మండలం అనంతరాజుపల్లె ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఇఒగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. దీంతో మంగళవారం నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ఎంఇఒ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు అనంతకృష్ణను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కొరకు ప్రభుత్వం రెండవ ఎంఇఒను ఏర్పాటు చేశారన్నారు. ఎంఇఒ-2 అనంత కృష్ణ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ యూనియన్ నాయకులు అల్లం అశోక్ కుమార్, రమేష్ బాబు, అలీఖాన్, మోహన్ రాజు, లీలాకృష్ణ, హరి, మహేష్ పాల్గొన్నారు.

కలకడ: మండల కేంద్రమైన కలకడ రెండవ ఎంఇఒగా రామచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతి మండలానికి ఇద్దరూ ఎంఇఒలు ఉండాలని నిర్ణయించడంతో ఈ క్రమంలో కలిచర్ల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి కలకడ రెండవ ఎంఇఒగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంఇఒ మునేంద్రనాయక్ తెలిపారు. రెండవ ఎంఇఒగా బాధ్యతలు చేపట్టిన రామచంద్రారెడ్డిని మొదటి ఎంఇఒ మునీంద్రనాయక్ ఉపాధ్యాయులు, ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

బి.కొత్తకోట : మండల విద్యాశాఖ అధికారి-2గా పదవి బాధ్యతలు చేపట్టిన భీమేశ్వర ఆచారిని ఎంఇఒ రెడ్డిశేఖర్, కార్యాలయ సిబ్బంది, సిఆర్‌పిలు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మండలానికి మరో విద్యాశాఖ అధికారిని కేటాయించడం జరిగిందన్నారు.

పుల్లంపేట : మండల నూతన విద్యాశాఖ అధికారిగా నాగ తిరుమలరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ గతంలో చిట్వేలి మండలం నాగవరం జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో విధులు నిర్వహించడం జరిగిందని పదోన్నతి పై అక్కడి నుంచి పుల్లంపేట అదనపు ఎంఇఒగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. నూతన ఎంఇఒగా ఎంపికైన నాగ తిరుమలరావు మండల ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డిని నాడు కలసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

అలీని కలిసిన ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి మీడియా సలహా దారుడు అలీని మంగళవారం హైదరాబాదు లో ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీ యాలపై, రాజకీ యంగా ఆర్థికంగా ముస్లిం మైనార్టీల అభివృద్ధి చెందడానికి తీసుకో వాల్సిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి మరింత బలోపేతానికి ముస్లిం మైనార్టీ సోదరులు సహకారం ఎంతో అవసరమన్నారు.



అలీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇక్బాల్ అహ్మద్

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-కురబలకోట

విద్యార్థులు సైబర్ నెరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని సిఐ శివాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ముడివేడు పోలీస్‌స్టేషన్ వారు కలశాలలోని విద్యార్థులకు యాంటీడ్రగ్స్, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ సిఐ మాట్లాడుతూ సైబర్‌క్రైమ్ అనేది కంప్యూటర్ ఆధారిత నేరమన్నారు. కంప్యూటర్, కంప్యూటర్ నెట్‌వర్క్, నెట్‌వర్క్ డివైజ్‌లే లక్ష్యంగా చేసే దాడి లేదా నేరపూరిత చర్యను సైబర్ క్రైమ్ అంటారని తెలిపారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనుకునే సైబర్ నేరగాళ్లు, హ్యాకర్లు ఇలాంటి నేరాలకు పాల్పడతారని, ముఖ్యంగా విద్యార్థులు వీరిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు సైబర్ నేరాలకు కఠినమైన శిక్షలు విధిస్తున్నాయని, ఎవరైనా ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని అన్నారు. ఇవే కాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే సైబర్ టెర్రరిజం, వ్యక్తులను లక్ష్యంగా చేసుకునే సైబర్ పోర్నోగ్రఫీ, సైబర్ స్టాకింగ్, సైబర్ డిఫమేషన్, ఆస్తులను లక్ష్యంగా చేసుకునే ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, మేధో సంపత్తి హక్కుల ఉల్లంఘన, ఫిషింగ్, క్రెడిట్ కార్డు మోసాలు వంటివి వివిధ రకాల సైబర్ నేరాలు ఉన్నాయని, తెలియని వారికీ ప్రతి విద్యార్థి తెలియజేయాలని ఆయన అన్నారు. ముడివేడు ఎస్ఐ ముబీన్ తాజ్ మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు ఇప్పటికే ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



కురబలకోట :మాట్లాడుతున్న సిఐ శివాంజనేయులు

కళాశాలలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యా ర్థుల్లో చైతన్యం తెచ్చి మాదక ద్రవ్యా లను అరికట్టడానికి యువత సహకరించాలని ప్రతి విద్యార్థిని మొబైల్‌లో దిశ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, ముడివేడు పోలీస్ సిబంది పాల్గొన్నారు.



రామసముద్రం : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రామసముద్రం : మండలంలోని చెంబకూరు పంచాయితీ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఎస్ఐ చంద్రశేఖర్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అపరిచిత కాల్స్‌ను నమ్మొద్దని, మీ ఫోన్లకు వచ్చే ఒటిపి లను ఇతరులకు పంపవద్దని అన్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్స్ ఇవ్వకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గంగిరెడ్డి, సచివాలయ ఉమెన్ పోలీస్ రేవతి, కానిస్టేబుళ్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** చెడు వ్యసనాలతో యువత పెడదోవ పట్టకుండా, క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎస్‌పి గంగాధర్ రావు ఆదేశాల మేరకు యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కఠిన వైఖరి అవలంబిస్తున్నాయని, ఎవరైనా మాదకద్రవ్యాలు, డ్రగ్స్ కొన్నా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు ఎస్ఐ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

కుష్టువ్యాధి నిర్ధారణలో స్వీయ పరీక్షలు నిర్వహించకునేంత అవగాహన ప్రతి ఒక్కరికి ఉండాలని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌సిడిసిపై ఎఎన్ఎం, సిహెచ్ఒ, ఆశ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ వ్యాధి లక్షణాలను వివరించారు. కుష్టువ్యాధి ప్రారంభ దశలోనే బలమైన ఉచిత (యండిటి) మందుల ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కార్యక్రమం విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఆరోగ్య కార్యకర్తపై ఉందని తెలిపారు.ఎ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎర్రకోటపల్లి వైద్యాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్‌బాబు ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఎంపిహెచ్ఎస్ షేక్.ముజీబ్‌బాషా, బీ.రెడ్డమ్మ. ఎఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి మూడు వారాల వరకు జరిగే లేప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్ విజయవంతం చేసి కుష్ఠ లక్షణాలు ఉన్న వారిని ముందే గుర్తించి వైద్యం అందించాలని డాక్టర్ సృజన కోరారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కుష్ఠ అనేది అంటువ్యాధి కాదని, అది ఒక దీర్ఘ కాలిక వ్యాధి కావున లక్షణాలు నిదానంగా వస్తాయని, సర్వేలో అందుకే ముందుగా గుర్తించడం వల్ల వ్యాధి లక్షణాలు ముదరకుండా ముందే చికిత్స చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నారాయణ, సూపర్వైజర్ హిమశంకరి, సునీల్, ఎంల్‌హెచ్‌పిలు, ఎన్ఎన్ఎంలు పాల్గొన్నారు.



నందలూరు : సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైఫోర్స్ మహేష్

వైసిపి నుంచి విముక్తి కోసమే పవన్ పోరాటం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి దుర్మార్గపు పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించడం కోసమే జనసేనాని పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ద్వారా పోరాటం మొదలు పెట్టారని జనసేన పార్టీ రాయల దక్షిణ కోస్తా పార్లమెంటరీ సమన్వయకర్త మైఫోర్స్ మహేష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి వైసిపి పాలన పోవాలని జనసేని పవన్ కళ్యాణ్ బలంగా పనిచేస్తున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రి చేయడం కోసం ప్రజలు ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. సమావేశంలో మహిళలు మల్లిక, సునీత, జనసైనికులు సందీప్, శ్రీనాథ్, రమణ, బాషా, షమి, దేవా, అసిఫ్ రేవంత్ పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

గ్రామ సమాఖ్యలు భవిష్యత్తు ఆర్థిక స్థితిపై విజన్ కలిగి ఉండాలని ఎపిఎం నిరంజన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో 32 గ్రామసమాఖ్య సంఘాల అధ్యక్షులకు విజన్‌బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సంఘ సభ్యులు సంఘంలోకి రాక మునుపు వారి ఆర్థిక స్థితి గతులు ఏ విధంగా ఉన్నాయి, ప్రస్తుతం సంఘాల్లో చేరిన తరువాత ఎలా ఉందనే ఆంశంపై చర్చించారు. రాబోయే ఐదేళ్లలో వారు అనుకున్నటువంటి లక్ష్యాలను ఎలా చేరుకోవాలనే విషయంపై మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎపిఎం నిరంజన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం నిరంజన్, సిసిలురెడ్డి బాబు, సుబ్బరాయుడు, రాజన్న, బాల గురవయ్య, చంద్రమోహన్‌రెడ్డి, రోజారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ శంకరయ్య

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ పథకాన్ని తీసు కొచ్చిందన్నారు.అధికారులు వారి కేటాయించిన పంచాయతీ, సచివాలయం పరిధిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా ప్రజలు నేరుగా తొమ్మిది రకాల ధృవ పత్రాలను అక్కడికక్కడే దరఖాస్తు చేసుకొని పొందవచ్చునన్నారు వాలం టీర్లు, గృహసారథులతో సమన్వయం చేసుకొని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రజల ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని వారి సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశానికి హాజరు కానీ అధి కారులు వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు పంచా యతీ కార్యదర్శులు హాజరయ్యారు.

దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎస్‌బివిడి సభ హైస్కూల్‌లో మంగళవారం 1992-97 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. తాము చదివిన పాఠశాలకు ఏదైనా కొంచెం సహాయం చేయాలనే ఉద్దేశంతో కళాశాల కరస్పాండెంట్ శ్రీరాములు, ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 5 గ్రీన్ బోర్డులు, పబ్లిక్ అడ్రెస్సింగ్ స్పీకర్, పిల్లలందరికీ జామెంట్రీ బాక్సులు, వాటర్ క్యాన్లు, మిఠాయిలు పంపిణీ చేవారు. కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు పాఠశాలను మరిచిపోకుండా వారికి తగిన సహాయం చేయడం అభినందనీయమన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 520 మార్కులు పైబడిన విద్యార్థులందరికీ ప్రోత్సాహ బహుమతులు అందిస్తామని పూర్వపువిద్యార్థులు తెలిపారు.

క్రీడాపాఠశాలకు నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని స్థానిక ఎస్‌బివిడి సభ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పాఠశాల పోటీలలో నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని పీడీ బాలశేఖర్ చంద్రకుమార్ తెలిపారు. తనుశ్రీ, లిఖిత, భరత్, సురక్షిత్‌రెడ్డి నలుగురు విద్యార్థులు త్వరలో జరగబోయే డివిజన్‌స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. నిరంతరం శ్రమిస్తే ఎంతటి కష్టాన్నయినా సులభంగా జయించవచ్చని వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడావిద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సాయి చంద్రకుమార్, బాలశేఖర్ విద్యార్థులు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, లక్కిరెడ్డిపల్లి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఆయన నివాసంలో భారీ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బండపల్లి ప్రేమాలయంలో సుదర్శన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అనాధాశ్రమంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. సుదర్శన్‌రెడ్డిని గజమాలవేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

క్షయవ్యాధి గ్రస్తులు చికిత్సతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకోవడం వలన వ్యాధి నుంచి బయటపడవచ్చునని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు రోజులకు మించి దగ్గు, సాయంత్రం సమ యంలో జ్వరం, రక్తంతో కూడిన గల్ల పడటం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే స్థానిక ప్రభుత్వాసుపత్రి నందు ఆర్‌టిపిసిఆర్ పరీక్ష, ఛాతి ఎక్స్‌రే తీసు కొని, టిబి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. బిడి, సిగరెట్టు, మందు, పొగాకు తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. టిబి రోగులకు పౌష్టికాహారం అందించేందుకు పద్మావతి హెల్త్ సొసైటీ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిబి యూనిట్ సిబ్బంది నాగిరెడ్డి, మురళి, క్రిష్ణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు , ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డిడి శ్రీనివాసనాయుడు

పశువుల బీమాపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రైతులకు పశువులబీమాపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ డిడి శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చిన్న సన్నకారు రైతులు పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా పాడిపశువులు గొర్రెలు మేకలు పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఆధారమైన పశువులు ప్రమాదవశాత్తు చనిపోతే పశుపోషదారుడు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ పశువులబీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా పశు పోషణ దారుడు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సుధీర్‌బెనర్జీ, పశు వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విష్ణు, కీర్తన, మహేష్ రైతులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఐ

బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి-కలకడ

బదిలీపై వెళ్లిన పోలీసుల సిబ్బందికి ఘనంగా సన్మానించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది కాంతారావు, ఖలీల్, శ్రీనివాసులు బదిలీపై వివిధ స్టేషనులకు వెళ్లారు. బదిలీపై వెళ్లిన పోలీస్ సిబ్బందికి పూలమాలలు వేసి దృశ్యాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ స్టేషన్‌లో విధులు ఎలాగ నిర్వహించారో బదిలీపై వెళ్లిన పోలీస్‌స్టేషన్‌లో కూడా సక్రమంగా విధులు నిర్వహించుకుని మంచి పేరు ప్రతి ష్టలు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నందలూరు : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా పని చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అరవపల్లి షాదీఖానాలో బదిలీపై వెళున్న నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రసాద్‌ను సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కలిసి శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ సెక్రటరీ ప్రసాద్ నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కొరకు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పంచా యతీ సెక్రటరీ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధానకార్యదర్శి సయ్యద్ అమీర్, రాష్ట్ర వైసిపి యువజన ప్రధాన కార్యదర్శి నడివీధిసుధాకర్, మదన్ మోహన్‌రెడ్డి, సర్పంచులు మోహన్‌రెడ్డి, గీతాల నరసింహారెడ్డి, మైనుద్దీన్, మోడ పోతుల రాము, విజయ్‌కుమార్, గుణ యాదవ్, మేస్త్రీ శంకర, కాకిచంద్ర, పెనుబాల నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

మాతృభాషపై ప్రేమ కలిగి ఉండాలి

వాల్మీకిపురం : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మాతృభాష పట్ల ప్రేమను కనబరచాలని, మాతృభాషను ప్రేమించినప్పుడు ఇతర భాషల అవగాహన సులభతరం అవుతుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కలీమ్ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉర్దూ భాష మాధుర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలన్నారు. తెలుగు భాష వలే ఉర్దూ కూడా ఎంతో మధురమైనదని, భాషలకు కులాలు, మతాలు ఉండవన్నారు. రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ఇందులో భాగంగానే ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉర్దూ అకాడమీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఖాద్రి, హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అయ్యాజ్, రోషన్ జమీర్, అలీ ఖాన్, శంకరప్ప, నవాజియా బేగం, కరీముల్లా, మెహతాజ్, గుల్జార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐచర్ వాహనం

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని కడప-చెన్నై ప్రధాన రహదారిపై నందలూరు కన్యకా చెరువు కట్ట పై ఆగి ఉన్న లారీని ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఐచర్ వాహనం ముందు భాగం దెబ్బతింది. వివరాలిలా వున్నాయి. కన్యకాచెరువు కట్టపై ఆగి ఉన్న లారీని కడప నుంచి రాజంపేటకు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్లు ప్రాణాలతో బయట పడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఐచర్ వాహనం ఢీకొనడంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన సోదరుడు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కర్ణాటక రాష్ట్రం, చిక్ బల్లపుర జిల్లా, బాగేపల్లి తాలుక చేలూరు గ్రామంలో నివాసమున్న పోతి జోన్నాల హరి అను ఇతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు. తన తమ్ముడు జోన్నాల శంకర్ (46) కూలి పనులు, వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తుండేవాడని చెప్పారు.ఇదిలా మా కుటుంబ సభ్యులమంతా కలసి కట్టేల కోసమని పిటిఎం మండలం, టి.సదుం పంచాయతీ, రామాపురం గ్రామానికి దగ్గర ఉన్న మల్లిసేట్టి వెంకటమ్మ పొలం పక్కన ఉన్న కట్టెలను కొట్టుకొని అదే రోజు సాయంత్రం సుమారు 4 గంటలకి ఒక వాహనంలోకి లోడ్ చేసుకుందామని పచ్చి కట్టెలను నా తమ్ముడుపైకి ఎత్తి వాహంలో వేసేటప్పుడు ప్రమాదవశాత్తు ఆ పచ్చి కట్టెలుపైన వెళ్తున్న కరెంటు తీగలు తగిలి విద్యుత్ ఘాతానికి గురై స్పృహ తప్పి క్రింద పడిపోయాడని అన్నారు. వెంటనే మా కుటుంబ సభ్యులు నా తమ్ముడిని 108 అంబులెన్సులో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ డాక్టరు ప్రథమ చికిత్స చేసి ఇతనికి మెరుగైన వైద్యం అవసరమని డాక్టరు సలహా మేరకు మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించినామన్నారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి చికిత్స నిమ్మితం తరలించినా మన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై శంకర్ మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని పిటిఎం పోలీసులు తెలిపారు.



బిపిఇడి, డిపిఇడి పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిపిఇడి, డిపిఇడి కళాశాలల విద్యార్థుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైవియూ వీసి ప్రొఫెసర్ చింతా సుధాకర్ మంగళవారం విడుదల చేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వరరెడ్డి, వైవియూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ్ రెడ్డిలతో కలిసి ఫలితాలను ప్రకటించారు. బిపిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షలకు 72 మంది హాజరుకాగా 72 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. డిపిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షకు 31 మంది హాజరుకాగా అందరూ పాసయ్యారని వివరించారు. వంద శాతం ఫలితాలు వచ్చిన సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సుమిత్ర పాల్గొన్నారు.

రైతులకు శాపం..
గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే

భూములు ఇచ్చేందుకు నిరాకరణ

పరిహారం మంజూరులో తేడా

మార్కెట్ ధర ఎకరా రూ. కోటి.. ప్రభుత్వ పరిహారం రూ. 15 లక్షలే


సర్కిల్ ఏర్పాటు చేయబోయే ప్రాంతం

ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు - కడప - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను కడప - కర్నూలు జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం 93 ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపడుతోంది. అయితే అనుసంధాన రోడ్డు గ్రీన్ ఫీల్డ్ సర్కిల్ రైతుల పాలిట శాపంగా మారింది. ఎకరా నుంచి 8 ఎకరాల వరకు రైతులు భూములు కోల్పోనున్నారు. మార్కెట్‌లో భూముల ధరలకు ప్రభుత్వ ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో సర్కిల్ ఏర్పాటుకు అవసరమైన భూములు ఇచ్చేందుకు రైతులు విముఖత చూపుతున్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణం...

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బెంగళూరు నుంచి విజయవాడకు 337 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది. ఆంధ్ర కర్నాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడి కొండ వద్ద హైదరాబాద్ - బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నై కోల్‌కత్తా హైవేపైకి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటున్నది. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతుంది. అందుకోసం జిల్లాలో 125 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు 1300 హెక్టార్ల భూములను వినియోగించనుంది. చాపాడు మండల పరిధిలో 350 ఎకరాలు భూసేకరణ చేపట్టారు. అనంతపురం, బూడిదపాడు, కుచ్చు పాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు వెదుర్ల గ్రామాల పరిధిలో 350 ఎకరాలు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం వినియోగించనున్నారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూ కొలతలు, రైతుల వివరాలు, అకౌంట్లు సేకరించే పనులు కూడా పూర్తయ్యాయి. రైతులు అకౌంట్లకు నష్టపరిహారం కూడా కొంత మందికి అందుతోంది.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ సర్కిల్..


బెంగళూరు - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కడప - కర్నూలు హైవే పై చాపాడు మండల పరిధి లోని ద్వారకానగరం, జడ్డి గారి కొట్టాల మధ్యలో 93 ఎకరాలలో హైవే సర్కిల్స్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రెవెన్యూ సిబ్బంది చుట్టు కొలతలు వేశారు.

రైతుల విముఖత..

గతంలో కడప -కర్నూలు హైవే నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులు ప్రస్తుతం తిరిగి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే సర్కిల్‌కు భూములు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. భూమి కొలతలు వేసేందుకు సిబ్బంది గత నెలలో వెళ్లగా భూములు కోల్పోతున్న రైతులు కొలతలు వేయనీకుండా అడ్డుకున్నారు. తరువాత తహశీల్దార్ సుభాని, ఆర్‌డిఒ శ్రీనివాసులు రైతులతో పలు దఫాలుగా మాట్లాడినప్పటికీ వారు ఏ మాత్రం ఒప్పుకోలేదు. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో పోలీసుల పర్యవేక్షణలో బలవంతంగా చుట్టు కొలతలు పూర్తి చేశారు. రైతులు గ్రామ సర్పంచ్ తీర్మానంతో కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. 20 నుంచి 30 ఎకరాల సరిపోయే రోడ్డుకు 93 ఎకరాలు సేకరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

భూముల ధర రూ.కోటి పై మాటే..

నేషనల్ హైవే సమీపంలో భూములు ఉండడంతో మార్కెట్‌లోకి ఎకరా రూ. 1 నుంచి 2 కోట్ల వరకు ధర పలుకుతున్నాయి. నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవేకు కేవలం రూ.10 లక్షలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని రైతులు వాపోతున్నారు. నేషనల్ హైవేకు ఇరువైపుల ఉన్న భూములకు మాత్రమే ఎకరాకు రూ. 25 లక్షలు ఇస్తామని మిగిలిన భూములకు రూ. 15 లక్షలు మాత్రమే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడం సరికాదంటున్నారు. 30 మంది రైతులు పూర్తిగా తమ భూములను కోల్పోనున్నారు. వారిలో ఇద్దరు రైతులు 7 ఎకరాల భూములను కోల్పోనున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేసే వరకు కొలతలు వేయనీయమని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు స్థానికంగా, కడప కలెక్టరేట్ వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రస్తుతం రైతులు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఎలాంటి చర్యలు జరగనివ్వమని తహశీల్దార్‌కు ప్రతి ఒక్క రైతు అర్జీ రూపంలో అందించారు. ఉన్నతాధికారులకు రైతులు అందించిన అర్జీలను పంపి వారి నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.


సర్కిల్ నమూనా

భూములన్నీ హైవేలలో కోల్పోయాం..

గతంలో కడప- కర్నూలు హైవేకు కొంత, ప్రస్తుతం బెంగళూరు విజయవాడ గ్రీన్ ఫీల్డ్, ఎక్స్ ప్రెస్ హైవేలో మిగిలిన 70 సెంట్లు స్థలాన్ని కోల్పోవాల్సి వస్తోంది. ఉన్న కొంత పొలాన్ని కూడా హైవే రోడ్లకు కోల్పోవడం వల్ల ఉపాధి కోల్పోతున్నాం. ప్రభుత్వం నష్టపరిహారం బదులు భూములు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం అనుసంధాన రోడ్డుకు 73 సెంట్లు స్థలాన్ని అధికారులు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం తగు న్యాయం చేయాలి.

-వీరభద్రుడు, బయనపల్లి దువ్వూరు మండలం.

ఆసరాగా ఎకరా పొలం మాత్రమే ఉంది..

జీవనోపాధికి ఆసరాగా ఎకరా పొలం మాత్రమే ఉంది. ఈ పొలం గ్రీన్ ఫీల్డ్, ఎక్స్ ప్రెస్ హైవేలో కోల్పోవాల్సి వస్తుంది. గతంలో 30 సెంట్లు స్థలాన్ని హైవే నిర్మాణానికి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం తిరిగి ఎకరా పొలాన్ని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కొలతలు వేస్తున్నారు. ప్రభుత్వం వృద్ధురాలు నైనా తన జీవనోపాధిని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

-పార్వతమ్మ ,రైతు, జడ్డి గారి కొట్టాలు.

ఉపాధి చూపి భూములు సేకరించాలి..

నేషనల్ హైవేకి భూములు సేకరించే ముందు రైతుల ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి ఉపాధి చూపిన తర్వాత భూములు సేకరించాలి. మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహారం మంజూరు చేయాలి. అధికారులు విచారణ చేసి భూములు కోల్పోయిన రైతులను గుర్తించి ఇతర ప్రాంతాలలోనైనా భూములు ఇవ్వాలి. లేనిపక్షంలో రైతులు ఆర్థికంగా ఇబ్బందికరంగా మారి కుటుంబ పోషణ కష్టమవుతుంది. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించాలి. ఇప్పటికే సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశాం. రైతులకు న్యాయం చేయకపోతే ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేపడతాం.

- దస్తగిరిరెడ్డి, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి


రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు (ఫైల్‌ఫోటో)

విద్యుత్ భారాలపై దశలవారీ పోరాటాలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, ఇతర పార్టీల నాయకుల పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

సెల్‌ఫోన్ రీఛార్జిల మాదిరిగానే ముందే విద్యుత్ సంస్థలకు డబ్బు చెల్లించవు పద్ధతిని ఉపస ంహరి ంచుకోవాలని, విద్యుత్ భారాలపై దశల వారీ పోరాటాలకు సిద్ధం కావాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పాత బస్టాండ్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామమోహన్ అధ్యక్షతన జిల్లా వామపక్ష పార్టీల, ఆమ్‌ఆద్మీ, లోక్ సత్తా పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ భారాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గాలి, నీరు తర్వాత ప్రజలకు ప్రధాన మౌలిక సౌకర్యంగా విద్యుత్తు ఉందనే విషయం రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారని చెప్పారు. ఆదేశిక సూత్రాల్లో భవిష్యత్తులో దేశ ప్రజలకు విద్యుత్తు సౌకర్యం లాభాలు లేకుండా, నష్టాలు లేకుండా 'విద్యుత్ బోర్డ్' ద్వారా అందించాలని 1948లోనే నిర్ణ యించారన్నారు. దీనికి భిన్నంగా నరేంద్ర మోడీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2022 విద్యుత్ బిల్లు పార్లమెంటులో అప్రజా స్వామ్య పద్ధతిలో, అశాస్త్రీయమైన బిల్లును, ఆర్డినెన్స్ రూపంలో తీసుకొచ్చి దేశ ప్రజలపై రుద్దుతోందని చెప్పారు. ఫిక్స్‌డ్, కస్టమర్, సర్‌ఛార్జీల పేర్లతో ప్రజాధనాన్ని కాజేస్తోందని పేర్కొన్నారు. ఇది ప్రజల శ్రమ శక్తిని, సంపదను పాలకులే ప్రజా భక్షకులుగా మారి లూటీ చేయటమేనని ఆరోపించారు. దేశంలోని బొగ్గు గనులు ఇతర ప్రకృతి సంపదనంతా అంబాని, ఆదానిలాంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్వం చేసి వారి నుంచి బిజెపి ఎన్నికల నిధులు సమీకరించుకుని, ఓట్లు కాసే చెట్లు లాగా ప్రజలను మార్చు తోందని వాపోయారు. ప్రజా చైతన్యాన్ని నీరుగార్చి, పక్కదారి పట్టిస్తోందని విమ ర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నెలలో సర్కారు ఖర్చుల కోసం ఆ నెలలోనే ప్రజల నుంచి పలు రూపాలలో, ప్రజాధనాన్ని పన్నులు, టాక్స్‌లు, సేవా సుంకం పేరుతో, ముక్కు పిండి వసూలు చేసుకుని, పాలకుల జేబుల్లో నింపు కుంటున్నారన్నారు. స్వార్థ పర పాలకులపై పోరాటానికి ప్రజా చైతన్యమే పరిష్కార మార్గమని నిర్ణయిం చామని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా జిల్లా సదస్సు నిర్వహించి, లక్ష కరపత్రాలు ముద్రించి ప్రజల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు నివసించే గ్రామాలు, వార్డులు పర్యటించి వారికి పెరిగిన విద్యుత్తు బిల్లులు, సర్ ఛార్జిల గురించి వివరిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులకు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు, మెమొరాండాలు ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా, విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు మహాధర్నాలు నిర్వహించాలని, 'రౌండ్ టేబుల్ సమావేశం' సమిష్టిగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బిజెపి, వైసిపి, టిడిపి మినహా జిల్లాలో కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను, విద్యుత్తు బిల్లుల వ్యతిరేక ఉద్యమంలో కలుపుకుని పోవాలని ఈ సమావేశం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమా వేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్ర శేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్య దర్శి డబ్ల్యూ.రాము, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ- 2 జిల్లా కార్యదర్శి అంకన్న, సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, ఆర్‌ఎస్‌పి జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి జయవర్ధన్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్.శ్రీనివాసులు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు దేవర కృష్ణ పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యతను చాటుతున్న వామపక్ష, ఇతర పార్టీల నాయకులు

ప్రాధాన్యతా రంగాల లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేస జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జెసి గణేష్ కుమార్‌తో కలిసి అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై సంబందిత అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో డివిజన్ల వారీగా టార్గెట్లు కేటాయించి సాగుబడి విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. అన్ని పంటలకు ఈ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. అన్ని ఆర్‌బికెలలో వ్యవసాయ పంటలకు అవసరమైన సూక్ష్మ పోషక, ఖనిజ దాతువుల స్టాకుతో పాటు పురుగు మందులను ఉంచాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగుబడిని పెంపొందించాలని ఆ దిశగా రైతుల్లో అవగాహన కల్గించాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తూ మండలం వారీగా ఆయా ప్రాంతాల్లో సాగుకు అనుకూలమైన తోటల పెంపకాన్ని చేపట్టేలా రైతులకు అవగాహన పెంచాలన్నారు. ఎపిఎంఐపి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేస్తూ.. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. మత్స్య శాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, నీటి వనరు ఉన్న ప్రాంతాల్లో చేపల ఉత్పత్తిని పెంపొందించాలన్నారు. ముఖ్యంగా పులివెందులలో ఫిష్ హబ్ లో చేపల సరఫరతో పాటు, అర్హులైన మత్యకారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేయలన్నారు. పట్టు పరిశ్రమకు సంబంధించి తొలకరి ప్రారంభం అయిన నేపథ్యంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లాలో ఔత్సహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్స హించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.శారదా, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, డిసిఓ సుభాషిణి, ఎల్‌డిఎం దుర్గాప్రసాద్, హార్టికల్చర్ జిల్లా అధికారి, మార్కెటింగ్ శాఖ డిఎం, వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలి

కడప అర్బన్ : అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫ్యాప్టో జిల్లా సెక్రెటరీ జనరల్ షేక్. మొహమ్మద్ ఇర్షాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించే రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్‌సుధను కడపలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 117ను అమలు చేసిందని తెలిపారు. జీవో ద్వారా పాఠశాల విద్య చిన్నాభిన్నమైందని విమ ర్శించారు. జీవోను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పాఠశాలలను సందర్శించే పేరుతో పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులను వేధిస్తున్నారన్నారు. గ్యారెంటీ పెన్షన్ స్కీమును అంగీకరించే ప్రశ్నే లేదన్నారు. చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సందర్భంగా శాసనసభ్యురాలు స్పందిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఉపా ధ్యాయుల, విద్యా రంగ సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చా రు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, బిటిఏ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్రబాబు, డాక్టర్.హరి కొండయ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం

అట్లూరు : కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మంగళవారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హమీదా బేగం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కుష్టువ్యాధిపై సమావేశం నిర్వహించారు. కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియం లేప్రే అను బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం చేస్తే వ్యాప్తి చెందుతుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు కన్పించడానికి మూడు నుండి ఐదు సంవత్సరంల వరకు పట్టవచ్చని, శరీరంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పితో కూడిన నరాలు, కాళ్ల లేదా చేతులు కండరాల్లో బలహీనతల, పాదాల తిమ్మిరిగా అన్పించడం వంటి లక్షణాలుంటే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రంలోలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. మండలంలో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి రోగులను గుర్తించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మురళీకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు

చెస్ టోర్నమెంట్‌లో రాణించిన భగతీశ్వర్ రెడ్డి

కడప : చెన్నై నగరంలోని రాయపేటలో ఉన్న వైఎంసిఎ హాల్‌లో ఈనెల 17, 18తేదీల్లో నిర్వహించిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో వైయస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన భగతీశ్వర్ రెడ్డి విభాగంలో 8వ స్థానంలో జాతీయ స్థాయిలో సాధించినాడు. 9 రౌండ్లకు ఐదున్నర పాయింట్లు సాధి ంచి బహుమతిని పొందాడు. ముఖ్యమైన అంతర్జాతీయ రాపిడ్ రేటింగ్ 80 పాయింట్స్ సాధించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు.

ఎసిబి వలలో ఎర్రగుంట్ల సిఐ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


సిఐ మంజునాథరెడ్డి

ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ సిఐ మంజునాథరెడ్డి ఎస్‌సిబికి పట్టుబడ్డారు. తిరుపతి ఎసిబి అడిషనల్ ఎస్‌పి దేవిప్రసాద్ ఇందుకు సంబ ంధించిన వివరాలు మంగళవారం వెల్లడించారు. స్టేషన్ పరిధిలోని నాపరాళ్ల గనుల వద్దనున్న వేస్ట్ మెటీరియల్‌ను రవాణా చేసే టిప్పర్ యజమానుల నుంచి ఒక్కో ట్రిప్పుకు రూ. 1500 నుంచి రూ. 3 వేల వరకు సిఐ మంజునాథరెడ్డి లంచం డిమాండ్ చేశారని, అందుకు సంబంధించి ఎర్రగుంట్లకు చెందిన టిప్పర్ యజమాని గరిశా గంగాధర్ రెడ్డి అనే వ్యక్తి ఏప్రిల్ 25న 14400 నెంబర్ ద్వారా స్పందనలో ఫిర్యాదు చేశారని తెలిపారు. చివరికి ఒక ట్రిప్పు రూ. 700కు బేరం కుది రినట్లు తెలిపారు. టిప్పర్ యజమాని నెల వరకు రవాణా చేసిన ట్రిప్పులకు సంబంధించి రూ. 18 వేలను సిఐ మంజునాథరెడ్డి జిలాని అనే వ్యక్తికి ఇవ్వమని చెప్పారని తెలిపారు. ఈనేపథ్యంలో మంగళవారం జిలాని టిప్పర్ యజమాని నుంచి రూ.8600 తీసుకుంటూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని మొత్తాన్ని స్వాధీనం చేసుకొని విచారిస్తున్నామని తెలిపారు. సిఐ మంజూనాథరెడ్డిని మరో టీమ్ కర్నూలులో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. ఎసిబి సిఐలు శ్రీనివాసులురెడ్డి, ఎలమ రాజు, కష్ణమోహన్, అలీ ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు అడిషనల్ ఎస్‌పి చెప్పారు.

సమన్వయంతోనే ప్రగతి సాధ్యం : విసి

కడప అర్బన్ : సమిష్టి కృషి, సమన్వయంతో శాఖల అభివృద్ధి జరగాలని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయ ఐటీ సెల్ సంచాలకులు ఆచార్య ఎం.వి.శంకర్ ఆధ్వర్యంలో గురుకులానికి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ సమగ్ర సమాచారంతో ఆధునికరించిన వెబ్‌సైట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ రెండు శాఖల సమగ్ర ప్రగతి వెబ్ సైట్ లింకులో ప్రతిబింబిస్తోందని తెలిపారు. మరింత సమర్థవంతంగా ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బోధన, పరిశోధన, అభివృద్ధిలో శాఖల మధ్య పోటీ ఉండాలన్నారు. చక్కటి సమన్వయంతో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చు అన్నారు.

భూ సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీనియర్ దళిత నాయకుడు ముత్యాల చెన్నరాయుడు మంగళవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూముల చేర్పులు మార్పులు, చుక్కల భూముల ఆన్‌లైన్, చెరువుతట్ట భూములకు పట్టాలు చేయడం, ఒకరి భూమి మరొకరికి ఆన్‌లైన్ చేయడం, పూర్వ భూముల హద్దులు చూపకపోవడం వంటి సమస్యలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. భూముల సమస్యలేగాక రేషన్, ఇతర ధృవీకరణ పత్రాలు మంజూరులో అధికారులు అలసత్వం వహిస్తున్నారని చెప్పారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు విన్నవించారు.


బయోమెట్రిక్ వేస్తున్న విద్యార్థులు

వంద శాతం బయోమెట్రిక్ వేయించాలి : పిఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

జగనన్న విద్యాకానుక పంపిణీలో విద్యార్థులతో వందశాతం వేయించుటలో సచివాలయ, విద్యాశాఖ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో వైఎస్‌ఆర్ జిల్లాను ప్రథమ స్థానంలోని నిలపాలని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అబవరం ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్, నగరపాలక బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, పుష్పలత ఆధ్వర్యంలో స్వయంగా విద్యార్థులచే బయోమెట్రిక్ అథెండికేషన్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌పిలు సచివాలయ విద్య కార్యదర్శి సహకారంతో వాలంటరీలు జివికె-4 లో వంద శాతం బయోమెట్రిక్ వేయించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1,58,156 మంది విద్యార్థులు జెవికె -4 ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అవసరమైన కిట్టును లబ్ధి పొందాలని పేర్కొన్నారు. వీరందరూ కిట్టులోని 8 రకాల కాంపౌండ్స్‌కు బయోమెట్రిక్ వేయించాలని సూచించారు. ఇప్పటికే జిల్లా మొత్తం విద్యార్థులకు అవసరమైన కిట్టును పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అందించామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడూ ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించి మండలాన్ని విందు శాతం బయోమెట్రిక్ అటెండికేషన్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే బయోమెట్రిక్ వేయించారు. 58,747 మంది విద్యార్థుల చేత బయోమెట్రిక్ వేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సి ఆర్ పి కృష్ణ,శంకర్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నాణ్యమైన ఉత్పత్తులను సరైన ధరలకు రైతులకు అందించేలా డీలర్లు కృషి చేయాలని రీజినల్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్‌మెంట్ ఎస్‌పి మాసూం బాషా పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ, విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడుతూ డీలర్లు నీతి, నిజాయితీగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించకుండా, న్యాయబద్ధంగా వ్యాపారం చేసుకుంటూ రైతుల పక్షాన నిలవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మాధవి, విజిలెన్స్ సీఐ ఈదురు బాషా, బాలగంగాధర్, గోవర్ధన్ రెడ్డి, సుమంత్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.


బదిలీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కడప అర్బన్ : మేలో నిర్వహించిన సాధారణ బదిలీలలో బదిలీ పొందిన ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు వెళ్లారని, అయితే సమస్య వల్ల ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యం అవుతున్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డిని కోరారు. మంగళవారం ఆర్‌జెడి ఛాంబర్‌లో యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 138 కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు పోస్టు లేకపోవడం వల్ల అక్కడ పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలు ఎవరు చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉందని చెప్పారు. అలాగే 138 కన్నా ఎక్కువ ఉన్న యూపీ పాఠశాలలు హై స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. ఆ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడు పోస్టు వచ్చినప్పటికీ వారికి డిడిఒ కోడ్ లేకపోవడంతో వారికి కూడా జీతాల సమస్య ఉందని తెలిపారు. ఆర్‌జెడి స్పందిస్తూ పిజిటి ఉపాధ్యాయుల జీతాలు కొంచెం ఆలస్యం అవుతాయని, మిగిలిన సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యోగా సీనియర్ గురువులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ట్రంక్ రోడ్‌లో ఉన్న మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్. అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సీనియర్ గురువులు మిత్ర యోగా సెంటర్ నిపుణులు డాక్టర్ ఆర్ రంగనాథ్ రెడ్డి, పద్మ యోగ సెంటర్ నిపుణులు పద్మావతిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిధులుగా డాక్టర్ వైఎస్‌ఆర్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ షేక్. బాషా మొహిద్దిన్, సిఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ సిఆర్‌ఐ సునీల్ జయంత్, సిఆర్‌ఐ దినేష్ కుమార్, జిల్లా బ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు ఎల్. లక్ష్మీదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రంగనాథ్ రెడ్డి 20 సంవత్సరాల నుంచి యోగాగురువుగా, వైద్యులుగా సేవలందిస్తూ రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు అందుకుని ప్రజల మన్ననలు పొందడం ప్రశంసనీయమన్నారు. మరో గురువు పద్మావతి 22 సంవత్సరాల నుంచి యోగాలో సేవలందిస్తూ రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు అందుకోవడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులు మరిన్ని సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



యోగా గురువులను సన్మానిస్తున్న బాషా మొహిద్దీన్

పీజీ తరగతులు ప్రారంభం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల విద్యార్థులకు తరగతులు ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎ, ఎంఎస్‌సి, ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులు తరగతులకు రెగ్యులర్‌గా హాజరు కావాలని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం వసతి గృహాలు సైతం అన్ని రకాల సౌకర్యాలతో సిద్ధంగా ఉంచామని తెలిపారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులు విలువైన పాఠ్యాంశాలు నష్టపోతారన్నారు.

విద్యాశాఖ అధికారిగా పుత్తా విజయ్‌రెడ్డి

వల్లూరు : మండల ఉప విద్యాశాఖ అధికారిగా పుత్తా విజయ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కడప కాగితాల పెంట ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్ నిమిత్తం వల్లూరు -2 ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి ప్రధానోపాధ్యాయులుగా తదుపరి మండల విద్యాశాఖ అధికారిగా రావడం అనేది ఆనందంగా ఉందన్నారు. సకాలంలో ప్రతి పని పూర్తి చేయడం తన లక్ష్యంగా భావిస్తున్నానని తెలిపారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కడప : వైద్య సేవలు ఖైదీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ జోహార్ బాబు సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని చెప్పారు. మంగళవారం కడప కేంద్ర కారాగారంలోని ఆడిటోరియంలో ఖైదీలకు కాలిక వ్యాధులపై కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య నిపుణులు పాల్గొని కైదులకు దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించారు. సెంట్రల్ జైల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఆరోగ్యం కాపాడుకోవాలని ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, డాక్టర్ ప్రవీణ్, సుదర్శన రెడ్డి, పివి ప్రసాద్, జాకీర్, రాజ్ కన్నా, చంద్రయ్య, ప్రసన్న, నాగేశ్వరయ్య, పెంచలయ్య, రాజేంద్ర, అల్లావల్లి, కాసిం వల్లి, స్రవంతి, ఖైదీలు పాల్గొన్నారు.


నైపుణ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

సిఎం ప్రారంభించబోయే పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ విజయ్‌రామరాజు మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 8న సిఎం ప్రారంభించబోయే పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరి వనం, సిటీ సెంటర్, గరండాల వంక చెరువు, క్రికెట్ స్టేడియం, నైపుణ్య శిక్షణ కేంద్రం పనులు ఎంత శాతం జరుగుతున్నాయని అధికారులను అడిగితెలుసుకున్నారు. ఆ మేరకు అన్ని పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఇంతవరకు జరిగిన పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. పనులను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, పురపాలక ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీలో ప్రవేశం పొందుటకు ఈనెల 19 నుండి 24వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26 నుండి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవడానికి అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జులై 3న సీట్లు కేటాయిస్తామని చెప్పారు. 4వ తేదీ నుండి తరగతులు ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుండి అన్ని డిగ్రీ కళాశాలల్లో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో ప్రత్యేకంగా వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. హెల్ప్ డెస్క్ ద్వారా నూతనంగా కళాశాలలో చేరే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా పొందవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తూతూ మంత్రంగా వైద్యశాఖ అధికారుల పర్యటన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలో కొద్ది రోజుల క్రితం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యటన ప్రాథమిక చికిత్స కేంద్రాలపై తూతూ మంత్రంగా సాగిందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రథమ చికిత్సా కేంద్రాలపై హడావుడిగా తనిఖీలు నిర్వహించారన్నారు. ప్రధాన రోడ్డు మీద ఉన్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేశారన్నారు. ఇంత జరిగాక ఏదో జరుతుందని ప్రజలు అందరూ చర్చించుకున్నారు. కానీ తర్వాత సీజ్ చేసిన ప్రథమ చికిత్సా కేంద్రం మళ్లీ యథేచ్ఛగా జరుగుతోందన్నారు. తద్వారా అధికారుల పర్యవేక్షణ ఎంత అద్భుతంగా ఉందో తెలుస్తున్నదన్నారు. పబ్లిక్‌గా సెలైన్ బాటిళ్లు, ఇంజెక్షన్లు, చిన్న పిల్లలకు వైద్యం నిర్వహిస్తున్నారన్నారు. కనీసం పేరు బోర్డు కూడా లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాన్ని నడుపుతున్నారన్నారు. అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దెబ్బతిన్న విద్యుత్ స్తంభం..

ప్రజాశక్తి - జమ్మలమడుగు


దెబ్బతిని కడ్డీలు కనిపిస్తున్న విద్యుత్ స్తంభం

పట్టణంలోని కన్నెల్లూరు ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా దెబ్బతిని, ప్రమాదకరంగా ఉంది. ఈ విద్యుత్ స్తంభంతోపాటు 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ కూడా అక్కడే ఉంది. విద్యుత్ స్తంభంపై భాగాన పెద్దలైన్ (11 కె.వి) అమర్చి ఉన్నారు. ఈ స్తంభం పూర్తిగా దెబ్బతిని లోపల ఉన్న కడ్డీలు సైతం బయటికి స్పష్టంగా కన బడుతున్నాయి. స్తంభం నెర్రెలు చీలి నేలకు ఒరిగే పరిస్థితి ఉంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని మార్చాలని ఆ శాఖాధికారులు స్పందిం చక పోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. పెద్దలైన్లు సపోర్టుతో ఈ స్తంభం నేలకొరగకుండా అలాగే ఉంది. నేలకు ఒరిగితే పెను ప్రమాదం జరిగే అవ కాశం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ శాఖాధికారులు చొరవ తీసుకుని స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

యోగాసనాలను సాధన చేయాలి

ప్రజాశక్తి - కడప


యోగ సాధన చేస్తున్న అధ్యాపకులు విద్యార్థులు

నేర్చుకున్న యోగా ఆసనాలను విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేసి మంచి ఫలితాలను సాధిం చాలని కడప ప్రభుత్వ పురు షుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ సూచిం చారు. మంగళ వారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యా ర్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. సూక్ష్మ వ్యాయామాల సాధన, సూర్య నమస్కారం, బత్రిక ప్రాణాయామం, కపాల భాతి ప్రాణాయామం మొదలైనటువంటి ఆసనాలను యోగా గురువు ఆదినారాయణ సాధన చేసి చూపించారు. వాటి సాధన వల్లే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివరామకృష్ణ, డాక్టర్ ఏ .నాగరాజు, డాక్టర్ వై.సావిత్రి, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

కడప అర్బన్ : ప్రజలందరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మానసిక ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం అలాంఖాన్ పల్లె లో ఉండే అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ మాన సికంగా ఇబ్బంది పడే వారిని గుర్తించి ఎప్పటి కప్పుడు వారి అరోగ్య పరిస్థితులు గమనిస్తూ వారిని మానసిక వైద్యులు దగ్గర చికిత్స చేయించాలన్నారు. వీరావతి సోషల్ వర్కర్ మాట్లాడుతూ ఒక వ్యక్తి తనలో తాను మాట్లాడుతూ ఉండడం, తనలో తాను నవ్వుతూ ఉండడం, పదే పదే చేతులు కాళ్ళు కడగడం, అనుమానించడం, శీలాన్ని శంఖించడం, చెవిలో ఏవో మాటలు వినపడుతున్నట్లు ఇలాంటి లక్షణాలు ను గుర్తించాలన్నారు. సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్ మాట్లాడుతూ ఎవరికైనా మానసిక జబ్బులు ఉన్నట్లు తెలిస్తే 14416 లేదా 1800-89-14416కు సమాచారం అందిస్తే సంరక్షణ సేవలు లభిస్తాయన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

కడప : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరదలచిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్య శాఖ వారు ఇటీవల ఇన్‌లైన్ అడ్మిషన్ల కోసం విడుదల చేసిందని ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థుల కోసం కళాశాలలో డిగ్రీ చేయదలచిన విద్యార్థులకు కళాశాలలో ఉచితంగా రిజిస్ట్రేషన్ సేవలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఉచితంగా ఎటువంటి సేవా రుసుం చెల్లించకుండా కళాశాలలో తమ ప్రవేశాల కోసం నమోదు చేసుకొనవచ్చని తెలిపారు. కళాశాల ఎంపికలను కూడా ఇక్కడే నిర్వహించుకోవచ్చు అని తెలియజేశారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు, నీలయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సుల ఎంపిక చేసుకొని తమ కలలను సాకారం చేసుకోవాలని అన్నారు. పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు ముఖ్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మ్యాగీ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, తొలకరి చినుకులు పలకరిస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. దుక్కులతోపాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు మొదలెట్టారు. ఇదే అదునుగా పలువురు వ్యాపారులు మాయమాటలతో నాసిరకం విత్తనాలు, సస్యరక్షణ మందులను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అందుకే గతంలో చాలా చోట్ల నాసిరకం విత్తనాలతో పంటలో ఎదుగుదల లేక రైతులు ఆర్థికంగా నష్టపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె, వెదురూరు, రాజుపాలెం, వీరభద్రపురం తదితర గ్రామాల్లో నకిలీ వడ్ల విత్తనాలు తెచ్చుకుని రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి మ్యాగీ రైతులకు సూచిస్తున్నారు. గుర్తింపు పొందిన తయారీ సంస్థల నుండి విత్తనాలు, ఎరువులు, మందులు కొనడం వల్ల ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నారు. ఒకవేళ ఏదైనా సమస్య వస్తే కంపెనీ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి వివరాలు లేకుండా ఇచ్చే వాటిని కొనుగోలు చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలు సందర్భంలో వ్యాపారుల నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నష్టం వాటిల్లిన సందర్భంలో వారిపై కేసు నమోదు చేయించి రైతులకు పరిహారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రసీదు లేకపోతే రైతుకు ఎలాంటి ఆధారం ఉండదన్నారు. విత్తనాల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటున్నారు. విత్తే ముందు మొలక శాతం పరీక్షించుకోవడం వల్ల నాణ్యత ముందుగానే తెలుసుకోవచ్చునని, తద్వారా విత్తనాల నాణ్యతను నిర్ధారించుకోవచ్చంటున్నారు. విత్తనాలు కొనుగోలు సందర్భంలో సంచులపై ఉండే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సీల్ నెంబర్, కాలపరిమితి తప్పనిసరిగా సరిచేసుకోవాలని, లేని వాటిని గుర్తించాలని అంటున్నారు. కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పురుగు మందుల కొనుగోలు సందర్భంలో ఐఎస్ఐ నెంబర్ ఉన్న వాటిని కొనుగోలు చేయడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే వ్యవసాయ అధికారుల నుంచి అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుంటే మంచిదన్నారు. రైతులు సేకరించిన విత్తనాలు, ఎరువుల నాణ్యతను వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో పరిక్ష చేయించుకోవచ్చునని ఎఒ సూచిస్తున్నారు.

రైతుల సమస్యలు తెలిసిన నాయకుడు రఘురాముడు

- మూడు తరాల ప్రజాసారథి పుస్తకావిష్కరణలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఎంపీ

ప్రజాశక్తి - చాపాడు


పుస్తకావిష్కరణలో ఇన్‌ఛార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు, కవులు

కెసి కెనాల్, తెలుగుగంగ ఆయకట్టు రైతుల నాడీ తెలిసిన ప్రజానాయకుడు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి జీవితచరిత్రను డాక్టర్ తవ్వా వెంకటయ్య రచించిన మూడతరాల ప్రజాసారథి పుస్తకావిష్కరణ మంగళవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమాన్ని కర్నూలు జాతీయ రహదారిలోని ఓ కల్యాణమండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సీనియర్ రాజకీయ నాయకుల్లో రఘురామిరెడ్డి ప్రథముడు అన్నారు. ఆయన నుంచి ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు ఓపిక, సహనం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ మూడు తరాల ప్రజాసారథిగా ముందుకు వెళుతున్నారన్నారు. 64 సంవత్సరాల రాజకీయ అనుభవంతో ఎన్‌టిఆర్, చంద్రబాబు, వైయస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పని చేసిన అనుభవం ఆయన సొంతమన్నారు. జిల్లాలో సాగునీరు ప్రాజెక్టులపై మంచి పట్టు ఉన్న నాయకులని కొనియాడారు. పసుపు, కెపి ఉల్లి రైతులకు అండగా నిలుస్తున్న నాయకుడని వారు ప్రశంసించారు. ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి మాట్లాడుతూ 1959 నుంచి తమ కుటుంబం రాజకీయాల్లో ఉందన్నారు. ఎన్‌టిఆర్ సహకారంతో మైదుకూరు నియోజకవర్గానికి తెలుగుగంగ ప్రాజెక్టును సాధించగలిగానన్నారు. వైయస్ జగన్ హయాంలో మైదుకూరును అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. నేటి రాజకీయాల్లో విలువలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబం గురించి తెలియని కొంతమంది యువ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం జిల్లాలోని ప్రముఖ కవులు, రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుధా, డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, జి.శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రచయితలు నరాల రామారెడ్డి, డాక్టర్ మూలా మల్లిఖార్జునరెడ్డి, తవ్వా ఓబుళరెడ్డి, జిల్లా నాయకులు, అధికారులు, నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు .

ఎమ్మెల్యేకు పలువురు నాయకుల శుభాకాంక్షలు

ఖాజీపేట : ఎమ్మెల్యే ఎస్. రఘు రామిరెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని ఆయన అభి మానులు, కార్యకర్తలు, నాయకులు మంగళ వారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సంద ర్భం గా ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, అగ్రహార సహకార సంఘం అధ్యక్షుడు పి.వి.రాఘవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి


పాఠశాలల వివరాలను తెలుసుకుంటున్న ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్

ప్రజాశక్తి - వేంపల్లె

అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని వేంపల్లె-2 విద్యాధికారి స్టాలిన్ ఐజాక్ తెలిపారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎంఇఒ-2గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన స్టాలిన్ ఐజాక్ కు ఎంఇఓ కార్యాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారం ఉండాలని కోరారు. తన సొంత ఊరిలోనే ఎంఇఒగా బాధ్యతలు స్వీకరించడం చాల సంతోషంగా ఉందన్నారు. అనంతరం మండలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల సంఖ్యను ఎంఇఒ వీరారెడ్డి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయనను కలిసిన వారిలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల పీడీ రాజశేఖర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారిగా సగలి భాస్కర్



దువ్వూరు : మండల విద్యాశాఖ అధికారిగా సగిలి భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎర్రగుంట్ల మండలం చిలమకూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా ఎంఇఒ లేకపోవడంతో ఆయనను ఇక్కడ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

చక్రాయపేట ఎంఇఒగా రామచంద్రారెడ్డి బాధ్యతలు



చక్రాయపేట : చక్రాయపేట మండల విద్యాశాఖ అధికారిగా రామచంద్రారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రనాయక్ అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలానికి బదిలీ అయ్యారు. అట్లూరు జెడ్‌పి హైస్కూల్ ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై రామ చంద్రారెడ్డి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభి .వృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్క రిస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తామన్నారు.

ఎంఇఒ-2గా రామానాయుడు



పులివెందుల రూరల్ : పులివెందుల ఎంఇఒ-2గా రామానాయుడు మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ఎట్టకేలకు ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణకు మోక్షం

ప్రజాశక్తి - వేంపల్లె



స్థానిక పులివెందుల రోడ్డులో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహ ప్రారంభానికి ఎట్టకేలకు మోక్షం లభించినట్లు తెలుస్తోంది. గత టిడిపి పాలనలో వేంపల్లెలోని పులివెందుల రోడ్డులో ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే టిడిపి పాలనలో విగ్రహా విష్కరణ కాలేదు. అయిదేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ విగ్రహానికి రంగులు, మెరుగులు దిద్దుతుండడంతో ప్రారంభానికి మోక్షం లభించినట్లు టిడిపి నాయకులు చర్చించుకుంటున్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి హయాంలో ఆయన కోరిక మేరకు రాయచోటి-పులివెందుల-కడప బైపాస్ రోడ్డులో గతంలో ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ రూ.40 లక్షల విలువ చేసే స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. దీనికి అదనంగా ఆయన దాదాపు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఫ్లోరింగ్ వంటి నిర్మాణం చేపట్టారు. సతీష్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు మాజీ సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి వారి సొంత ఖర్చులతో ఎన్‌టిఆర్ పెద్ద విగ్రహం ఏర్పాటు చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో విగ్రహావిష్కరణ అనుకున్నప్పటికీ కొని పనులు పెండింగ్‌లో ఉన్నందున చేయలేకపోయారు. మలి దశలో షబ్బీర్ ఆ పెండింగ్ పనులు పూర్తి చేసినప్పటికీ ప్రారంభం చేసేందుకు లోకేష్ బాబు, సినీనటుడు, హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇద్దరిలో ఎవరో ఒకరిచే ప్రారంభించాలనుకున్నా వీలుకాలేదు. ప్రస్తుతం షబ్బీర్ టిడిపికి చెందిన పెద్ద నాయకుల చేతుల మీదుగా విగ్రహాన్ని ప్రారంభించేందుకు సొంత డబ్బులు ఖర్చు చేసి మెరుగులను తీర్చిదిద్దుతున్నారు.

బిఎఫ్ఎ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కడప అర్బన్ : వైవీయూ కళాశాలలో లలితకళా విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (బిఎఫ్ఎ) కోర్సులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వైవీయూ లలితకళా విభాగం విభాగాధిపతి డాక్టర్ కె. మృత్యుంజయ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూప్‌లో అయినా ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో డిజైనర్, ఆర్టిస్ట్‌గా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక స్కూల్‌లలో ఆర్ట్ టీచరుగా, సినీ రంగంలో సెట్ డిజైనర్‌గా, ఇంటీరియర్, ఫ్యాషన్ డిజైనర్‌గా రాణించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందుకోవచ్చని పేర్కొబ న్నారు. ఆసక్తిగల విద్యా ర్థులు ఈ నెల 24 లోపు వెబ్‌సైట్‌లో నమోదు చేసు కోవాలన్నారు. వివ రాలకు 9492345419, 9010014304లలో సంప్ర దించాలన్నారు.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలలు నిర్వహించాలి

కడప అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని యాజమాన్య పాఠశాలలు నిర్వహించాలని ఎంఇఒ పాలెం నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈనెల 24 వరకు పాఠశాలలు ఉదయం 7:30 నుంచి 11:30 వరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రయివేట్ యాజమాన్యాలు రెండు పూటల పాఠశాలలు నిర్వహిస్తే వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

రోడ్లను బాగు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి జమ్మలమడుగు

దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని సిఐటియు పట్టణ కమిటీ నాయకులు విజయ్ కోరారు. స్థానిక అర్‌అండ్‌బి అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డికి మంగళవారం సిఐటియు నాయకులు దాసన్న, విజయ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి రోడ్డు మార్గంలో వంతెన వద్ద, మోరగుడి, దొమ్మరనంద్యాల మార్గం మధ్యలో రోడ్డంతా దెబ్బతిందన్నారు. నిత్యం ఈ మార్గంలో ఆటోలు, బైకులు, పెద్ద వాహనాలు వందల సంఖ్యలో తిరుగుతుంటాయన్నారు. ఈ మధ్య దొమ్మర నంద్యాల రహదారిలో ఆటో బోల్తా పడిందన్నారు. అంతేకాకుండా మోరగుడి నుంచి దొమ్మర నంద్యాల క్రాస్ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తాడిపత్రి రహదారుల వద్ద ఉన్న కాలువ దగ్గర రోడ్డు పూర్తిగా దెబ్బతిని, రాత్రి వేళల్లో వాహనాలు ఏమాత్రం ఆదమరిస్తే కాలువలో పడే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో ఈ గుంతలు మరీ దారుణంగా తయారవు తాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అబ్రహం, రాజు, దివాకర్ పాల్గొన్నారు.

బిటెక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో జూన్ నెలలో నిర్వహించిన బిటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ రెగ్యులర్(ఆర్ 19) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ 24 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాలను కొద్ది సమయంలోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణను అభినందించారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచా మన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో పరీక్ష ఫలితాలు తెలుసుకోవచ్చునని ప్రిన్సిపల్ వివరించారు. విద్యార్థులను ఆయా విభాగాధిపతులు అభినందించారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోనే ప్రజలకు ఉపయోగకరం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి, టిడిపి మేనిఫెస్టోలు కంటే కాంగ్రెస్ మేనిఫెస్టోనే ప్రజలకు ఉపయోగకరమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నవరత్నాలు నకిలీవన్నారు. టిడిపి సూపర్ సిక్స్‌లోని అన్ని అంశాలు కలిసిన కాంగ్రెస్ పథకంలోని మొదటి పథకానికి సరికావని చెప్పారు. కాంగ్రెసు అధికారంలోకి వస్తే 6 సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు రూ.6 లక్షల వరకు రుణమాఫీ అన్నారు. రూ.500కే వంట గ్యాస్ పంపిణీ చేస్తామన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6 వేలు ఆర్థికసాయం చేస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహాలో అభివృద్ధి ప్యాకేజీ అమలు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, బాబు, నాగార్జున పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌టి నాయకులు

ఎస్‌టిల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలోని ఎస్‌టిల అభివృద్ధికి ఎస్‌టి సెల్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎం.దారునాయక్ కృషి చేయాలని ఎస్‌టి సెల్ జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షుడు హనుమంతు నాయక్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం దారు నాయక్ పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతు నాయక్ మాట్లాడుతూ దారు నాయక్ ఆయురారోగ్యాలతో ఉంటూ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీరా నాయక్, హరి నాయక్, దస్తగిరి నాయక్, దమ్ము నర్సింహులు, సివి సుబ్బయ్య, రమణ, నవీన్ నాయక్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

ఈనెల 26నుంచి జులై 16వరకు కుష్టువ్యాధి కేసుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యస్. శ్రీనివాస్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆశా, ఆరోగ్య, వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి కేసుల గురించి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎంఒ శ్రీనివాస్, సుపర్‌వైజర్స్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం పనిచేయండి

- డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్ పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ కార్యాలయంలో మంగళవారం ఎపిఎం, సిసిలతో జగనన్న పాలవెల్లువపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని 164 గ్రామాల్లో పాల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాడి రైతులకు జీవనోపాధి పెంపుదల కోసం పాడి పశువులను కొనుగోలుకు పెద్ద ఎత్తున మహిళా సంఘాలకు రుణాలిచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పాల కేంద్రాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి వాటిని సాధించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించి, పాల ఉత్పత్తులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, డిపిఎం మాలకొండయ్య, ఎపి డిడిసి మేనేజర్ వెంకటేశ్వరమ్మ, ఏడు మండలాల ఎబిఎంలు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌నాయక్